క్లుప్తంగా

'జల'వరపాటు



ఎస్‌బీ.పేట పరిధిలో ముంపునకు గురైన ఆయిల్‌పామ్ తోట

తుని రూరల్: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పలు గ్రామాల్లో ఉద్యాన పంటలు ముంపు బారిన పడ్డాయి. కొలిమేరు, ఎన్.సూరవరం, కూటయ్యపాలెం, ఎన్.ఎస్.వి.నగరం, సుభద్రయ్యమ్మపేట, తదితర గ్రామాల్లో అరటి, కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటలు, కూరగాయల పంటలు ముంపునకు గురయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలతో పాటు కొండలపై నుంచి దిగువకు చేరిన వరదనీరు వరిపైర్లకు అనుకూలంగా ఉన్నప్పటికీ ఉద్యాన పంటలు, పండ్ల తోటల్లో నీరు నిలిచిపోయింది. దీర్ఘకాలం ముంపులో ఉండకుండ నీరు దిగువకు పోయే మార్గాలను ఏర్పాటు చేయాలని ఉద్యాన అధికారి సుజాత రైతులకు సూచించారు. ప్రధానంగా కూరగాయల పంటల్లో రైతులు నీటి యాజమన్యం చేయాలన్నారు.

ఉచిత ఆయుర్వేద శిబిరం

గండేపల్లి: రెడ్ క్రాస్ యూత్ యూనిట్ ఆధ్వర్యంలో సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ నందు శుక్రవారం ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించినట్టు డిప్యూటీ ప్రో ఛాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. విజయవాడ పిళ్లయార్ ఆయుర్వేద వైద్యశాలకు చెందిన ప్రముఖ వైద్య నిపుణులు గ్రంధి సత్య ప్రశాంత్ పాల్గొని ఆదిత్య సిబ్బందికి వ్యక్తిగత ఆరోగ్య సలహాలు, ఆయుర్వేద పద్ధతిలో జీవనశైలి మార్పులు, ఆరోగ్య పరిరక్షణ మార్గదర్శకం చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారని పేర్కొన్నారు.

జీఎస్టీ మినహాయింపును అమలు చేయాలి

రౌతులపూడి: జీఎస్టీ మినహాయింపును వ్యాపారస్తులు తప్పనిసరిగా అమలు చేయాలని ఎంపీడీఓ బి.శివరామకృష్ణయ్య కోరారు. శుక్రవారం వినియోగాదారులకు తన కార్యాలయం వద్ద అవగాహన కల్పించారు. మండలంలోని వివిధ వ్యాపార సంస్థల ద్వారా చేపడుతున్న వస్తువుల అమ్మకాల్లో జీఎస్టీ మినహాయింపును వ్యాపారస్తులు తప్పనిసరిగా పాటించాలన్నారు. కొనుగోలు చేసే ప్రతి వస్తువుపైన జీఎస్టీని మినహాయింపును గుర్తుంచి వస్తువు కొనుగోలు చేసుకోవాలని వినియోగదారులకు సూచించారు. దీనివలన ప్రతి వినియోగదారుడికి కొంతమేరకు లాభం చేకరతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, ఉప సర్పంచ్ వాసిరెడ్డి భాస్కరబాబు, వెలుగు సిబ్బంది, వివిధ వ్యాపార సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓట్ల చోరీపై సంతకాల సేకరణ

రౌతులపూడి: ఓటర్ల జాబితా అవతవకలపై కాంగ్రెస్ దేశవ్యాప్తంగా చేపడుతున్న ఉద్యమంలో భాగంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నాగం బులివెంకన్నదొర ఆధ్వర్యంలో శుక్రవారం రౌతులపూడిలో సంతకాల సేకరణ చేపట్టారు. నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి నీరుకొండ సత్యన్నారాయణతో కలసి ఆయన స్థానిక మార్కెట్ సెంటర్, సినిమా సెంటర్‌లో పర్యటించి ప్రజలు నుంచి సంతకాలు సేకరణ చేశారు. ఎన్డీయే ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఓట్లను చోరీ చేసి అక్రమంగా గద్దెనెక్కిందన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి అక్రమాలు జరగకుండా ప్రజల్లో చైతన్యం తేవటానికే ఈ సంతకాలు సేకరణ చేపట్టామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మొయ్యేటి సూర్యప్రకాష్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు దిమ్మల చక్రరావు, మండల ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ ఏనుగుపల్లి లోవరాజు పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం

అన్నవరం: రత్నగిరి వనదేవత వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం ఘనంగా నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు వనదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిననంతరం చండీ హోమం ప్రారంభించారు. హోమం అనంతరం హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి ఘనంగా పూర్ణాహుతి నిర్వహించారు.

వృద్ధులకు పండ్ల పంపిణీ

ప్రత్తిపాడు: ఎంసీఆర్ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఎంసీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, విశ్రాంత అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ మిద్దెం చిన్నారావు తెలిపారు. గతంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టామని ప్రత్తిపాడు శ్రీఏగులమ్మ అమ్మవారి ఆలయ సమీపాన గల రచ్చబండ వద్ద మిద్దెం వీర వెంకట రమణ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం సుమారు వంద మంది వృద్ధులకు ఆయన పండ్లు పంపిణీ చేశారు.

జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రౌతులపూడి: మండలంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు అండర్-14, 17 ఆటల పోటీలు, అథ్లెటిక్స్ క్రీడల్లో మండల స్థాయి పోటీలను నిర్వహించారు. శుక్రవారం స్థానిక ఎ.మల్లవరం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఈ కీడ్రల్లో మండలంలోని రౌతులపూడి, ములగపూడి, బలరామపురం, లచ్చిరెడ్డిపాలెం, ఎస్.అగ్రహారం, పారుపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కబడ్డీ, కోకో, వాలీబాల్, పరుగు పందెంలతో, అథ్లెటిక్స్ క్రీడల్లో గెలుపొందిన విద్యార్థి బృందాలను జిల్లాస్థాయికు ఎంపిక చేసినట్లు ఎంఈఓ కె.సతీష్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఆటలపోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన పీడీలు, పీఈటీలు, పాల్గొన్నారు.

స్పీకర్ స్థాయిలో అబద్ధాలు తగునా..?

- అయ్యన్నపై నిప్పులు చెరిగిన తోట నరసింహం
- స్పీకర్ పదవిని దిగజార్చుతున్నారని మండిపాటు



జగ్గంపేటలో కోటిసంతకాల ప్రజా ఉద్యమం పోస్టర్ విడుదల చేసిన ఇన్‌చార్జి తోట నరసింహం, పార్టీ ముఖ్య నాయకులు

జగ్గంపేట: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రారంభించిన మెడికల్ కాలేజీల నిర్మాణాలకు ఎటువంటి పర్మిషన్‌లు లేవని శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు విమర్శించడం పట్ల మాజీ మంత్రి, జగ్గంపేట వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం మండిపడ్డారు. జగ్గంపేట పార్టీ కార్యాలయంలో శుక్రువారం మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడాన్ని నిరశిస్తూ చేపట్టిన కోటిసంతకాల సేకరణ, ప్రజా ఉద్యమం పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తోట మాట్లాడుతూ అయ్యన్నపాత్రుడు తన స్థాయిని మరిచి మెడికల్ కాలేజీల పట్ల తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని స్పీకర్ పదవిని అపహాస్యం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. నర్సీపట్నంలోనే మెడికల్ కాలేజి నిర్మాణాలను, పర్మిషన్లు జగన్ ప్రత్యక్షంగా చూపించడంతో కూటమి నేతలు కంగుతిన్నారని విమర్శించారు.

సామాన్యుడికి వైద్య విద్య దూరం

రాష్ట్రంలో సామాన్యులు, పేద వర్గాల వారి పిల్లలు సైతం డాక్టర్లు కావాలనే కలలని జగన్ సాకారం చేసేందుకు కంకణం కట్టుకుని రాష్ట్రంలో 15 మెడికల్ కాలేజీలు నిర్మాణం చేపడితే వాటిని ప్రైవేట్ పరం చేయడానికి కూటమి నేతలు, ముఖ్యమంత్రి చంద్రబాబు కుట్ర పన్నుతున్నారన్నారు. దీన్ని ఎట్టి పరిస్థితులలోను అంగీకరించేది లేదని అక్టోబర్ 10 నుంచి నవంబర్ నెలాఖరువరకూ గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో వివిధ రీతిల్లో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ముఖ్య నేతలు ఒమ్మి రఘురాం, రామకుర్తి జగాల్, జాన్‌వెస్లీ, ఉయ్యూరి నాని, గండేపల్లి ఎంపీపీ చలగళ్ల దొరబాబు, జిల్లా నేతలు రామకుర్తి మూర్తి, పెద్దాడ రాజబాబు, సుంకర వీరబాబు, కరుటూరి వీర్రాజు, రావుల గణేష్‌రాజా, వరుపుల సూరిబాబు, గిడియాల పెదకాపు, పార్టీకి చెందిన వివిధ అనుబంధ సంఘాల నేతలు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

'ముదునూరి' కుటుంబానికి ఎంపీ బోస్ పరామర్శ



ముదునూరి రామరాజును పరామర్శిస్తున్న పిల్లి సుభాష్ చంద్రబోష్, సూర్యప్రకాష్

ప్రత్తిపాడు రూరల్: వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు తండ్రి రామరాజు గత కొద్ది రోజులుగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్నారు. మండలం ధర్మవరం గ్రామంలోని మురళీకృష్ణంరాజు స్వగృహంలో రామరాజును ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ ఆయన తనయుడు వైఎస్సార్ సీపీ అంబేడ్కర్ కోనసీమ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు, రామచంద్రపురం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్‌తో కలిసి శుక్రవారం పరామర్శించారు. ముదునూరి రామరాజు ఆరోగ్య పరిస్థితిని ఆయన కుమారులు మురళీకృష్ణంరాజు, సీతారామరాజులను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం మెరుగుపడేంత వరకు తగు విశ్రాంతి తీసుకోవాలని రామరాజుకు సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ ముఖ్య నాయకులు ఉన్నారు.

అంగన్వాడీ.. అవస్థల బడి



అల్లిపూడిలో అసంపూర్తిగా ఉన్న అంగన్వాడీ కేంద్రం

కోటనందూరు: అల్లిపూడిలో అంగన్వాడీ కేంద్రం -5కు సొంతభవనం లేక సామాజిక భవనంలో నిర్వహిస్తున్నారు. ఒక పక్క స్థానికుల సామాజిక అవసరాలతో పాటు ఈ ప్రాంత యువత సామాజిక భవనం ప్రాంతంలో ఆడుతున్న క్రీడలతో కేంద్ర నిర్వహణకు విఘాతం కలుగుతోంది. మరోవైపు సామాజిక భవనం శిథిలావస్థకు చేరి శ్లాబు నుంచి పెచ్చులు ఊడిపడుతు ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని ఇటు చిన్నారుల తల్లిదండ్రులు, అటు సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. కాగా ఈ కేంద్రానికి 2014కు ముందే శాశ్వత భవనం మంజూరైంది. శ్లాబ్ లెవల్ వరకూ పనులు పూర్తి చేశారు. తుదిదశ పనులు పూర్తి చేయకుండా వదిలేయడంతో నేటికీ ఆ భవనం అసంపూర్తిగానే మిగిలి ఉంది. ఈ కేంద్రం దుస్థితిని అధికారులు గాని, ప్రజాప్రతినిధులు గాని పట్టించుకోలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అసంపూర్తి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వ్యర్థాలు ఎత్తరు.. తరలించరు



తాండవ బ్రిడ్జివద్ద డంప్ చేసిన వ్యర్థాలు

తుని రూరల్: డి.పోలవరంలో సేకరించిన చెత్త, ఇతర వ్యర్థాలు తాండవ బ్రిడ్జివద్ద డంప్ చేస్తుండడంతో అటుగా రాకపోకలు సాగించే రైతులు, వివిధ గ్రామాల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నెలకొకసారి దగ్ధం చేస్తుండడంతో నాలుగైదు రోజులు పొగ అలుముకోవడంతో అటుగా రాకపోకలు సాగించే రైతులు, వివిధ గ్రామాలకు చెందిన ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. డి.పోలవరం గ్రామస్తులతో పాటు ఎన్.ఎస్.వి.నగరం, కొలిమేరు, ఎన్.సూరవరం, సుభద్రయ్యమ్మపేట, తదితర గ్రామస్తులు ఈ మార్గం గుండా ప్రయాణిస్తుంటారు. వ్యర్థాలతో దుర్గంధం భరించలేకపోతున్నామని, పంచాయతీ అధికారుల సూచనలతోనే వ్యర్థాలు వేస్తుండడంతో ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియడంలేదని స్థానికులు వాపోతున్నారు. మండలస్థాయి అధికారులు స్పందించి వ్యర్థాలను ఇక్కడ వేయకుండ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అధికారుల మార్పుతో అభివృద్ధి ఎలా..?



శంఖవరం మండల పరిషత్ కార్యాలయంలో నిరసన తెలుపుతున్న ప్రజా ప్రతినిధులు

శంఖవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు బహిష్కరించారు. ఎంపీపీ పర్వత రాజుబాబు ఆధ్వర్యంలో కార్యాలయం బయట ప్రజా ప్రతినిధులు నిరసన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామాల్లో పని చేసిన అభివృద్ధికి పనులకు వాటి బిల్లులు మంజూరు కాక ఇబ్బందులు పడుతున్నామన్నారు. గ్రామాల్లో ఒక అభివృద్ధి కార్యక్రమాన్ని కూటమి నాయకులు చెయనీయడం లేదని వాపోయారు. అభివృద్ధి అంతంత మాత్రంగా ఉందని పారిశుద్ధ్యం సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మండలానికి ఐదుగురు ఎంపీడీఓలు బదిలీలయ్యారని ఇలా మూడు నెలలకు ఒక ఎంపీడీఓ మారితే మండలంలో అభివృద్ధి ఏలా జరుగుతుందని, ప్రస్తుత ఎంపీడీఓ మరో నాలుగు నెలల్లో రిటైర్ అవుతారన్నారు. ఈ నేపథ్యంలో ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజల సమస్యలను గాలికి వదిలేశారని సభ్యులు మండిపడ్డారు. మండల అభివృద్ధికి అటంకం కలిగిస్తుంది ఎవరో తక్షణమే తెలియాలన్నారు. లేదంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు ధారా వెంకటరమణ, ఈగల చిన్నమ్ములు, ఎంపీటీసీలు దడాల సతీష్, చప్పా రాంబాబు, చల్లా సత్యప్రసాద్, పిర్ల నాగేశ్వరరావు, సర్పంచ్‌లు రామిశెట్టి ఏసుబాబు, కూనిశెట్టి మాణిక్యం, మేకల సత్యనారాయణ, తోట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన గురుకుల విద్యార్థినులు



పోటీల్లో రాణించిన గురుకుల విద్యార్థినులు

ఏలేశ్వరం: పట్టణంలోని స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మండల స్థాయి ఫెడరేషన్ పోటీల్లో గురుకుల విద్యార్థినులు ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ చంద్రశారద ఓ ప్రకటనలో తెలిపారు. సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు 34 మంది ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్‌తో పాటు వివిధ పోటీల్లో రాణించి పలు పతకాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా క్రీడా విద్యార్థినులను పలువురు అభినందించారు.



కలెక్టర్ షాన్మోహన్ చేతులమీదుగా జ్ఞాపిక అందుకుంటున్న దేవిధనుష

కేజీబీవీ విద్యార్థిని ప్రతిభ

తొండంగి: మండలంలోని వాకదారిపేటలో కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయ కేంద్రం విద్యార్థిని జి.దేవిధనుష శుక్రవారం ఇంటర్నేషనల్ గర్ల్ చైల్డ్ డే సందర్భంగా సేవ్ గర్ల్ చైల్డ్ అంశంపై కాకినాడలో నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో విద్యార్థిని తృతీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షాన్మోహన్ చేతులమీదుగా జ్ఞాపికను రూ.2వేలు నగదు బహుమతిని అందించారు. విద్యార్థినిని పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

రుణాల చెల్లింపులపై అవగాహన



రుణాల వసూళ్లపై అవగాహన కల్పిస్తున్న డీసీసీబీ సిబ్బంది

రౌతులపూడి: గ్రామీణ ప్రాంతాల్లో సొసైటీలు, డీసీసీబీ బ్యాంకులు ద్వారా రైతులు తీసుకున్న వివిధ రుణాలను సక్రమంగా చెల్లించే విధంగా సహకార రంగాన్ని పటిష్ట పరచాలని డీసీసీబీ ఏజీఎం డి.ఏసుబాబు కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో అన్నవరం బ్రాంచి మేనేజర్ బషీర్‌నిషా ఆధ్వర్యంలో రుణాల వసూళ్లపై పర్యటన చేపట్టారు. రుణాల వసూళ్ల, బ్యాంకు అభివృద్ధిపై ప్లకార్డులు ప్రదర్శించి రైతులకు అవగాహన కల్పించారు. తీసుకున్న రుణాలను నిర్ణీత కాలవ్యవధిలో చెల్లించి తిరిగి రుణాలు పొందాలన్నారు. బంగారు వస్తువులపైన, విద్య, గృహ రుణాలకు బ్యాంకుల ద్వారా రుణాలు పొందేందుకు సదుపాయం ఉందన్నారు. ఈ అవకాశాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ ప్రధాన బ్యాంచి మేనేజర్ డి.శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ వెంకటేశ్వరరావు, రౌతులపూడి సొసైటీ కార్యనిర్వాహణాధికారి జమీలు, సిబ్బంది పాల్గొన్నారు.

బోధనేతర పనుల బహిష్కరణ



ఎంఈఓ చిమ్మరాజుదొరకు వినతిపత్రం అందిస్తున్న ఫ్యాప్టో సభ్యులు

గోకవరం: పాఠశాలల్లో బోధనకు మాత్రమే పూర్తి సమయాన్ని వెచ్చిస్తూ నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించే విధంగా కార్యక్రమాలు ఉండాలనే ఉద్దేశంతో బోధనేతర పనులను అక్టోబరు 10 నుంచి బహిష్కరిస్తున్నామని మండల ఫ్యాప్టో సభ్యులు తెలిపారు. ఈ మేరకు ఎంఈఓ చిమ్మరాజుదొరకు శుక్రవారం ఫ్యాప్టో సభ్యులు వినతి పత్రం సమర్పించారు. ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన పనులు, పరీక్షల నిర్వహణ వంటి అవసరమైన పనులు మాత్రమే తప్ప బోధనేతర పనులకు చెందిన అన్ని ఆన్లైన్ పనులను రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో బహిష్కరిస్తున్నామన్నారు.

ఆదిత్య ప్రొఫెసర్‌కు డాక్టరేట్

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ప్రొఫెసర్‌కు డాక్టరేట్ లభించినట్టు ప్రో వైస్ ఛాన్సలర్ రవి తంగజన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. యూనివర్సిటీలో మేనేజ్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ అనిల్ కుమార్ కామర్స్, మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాధిపతి ప్రొఫెసర్ జాలాది రవి పర్యవేక్షణలో సమర్పించిన గ్రంధానికి ఇంపాక్ట్ ఆఫ్ ఈ-లెర్నింగ్ ప్లాట్ ఫారమ్స్ ఆన్ స్టూడెంట్ పెర్‌ఫార్‌మెన్స్, సిల్క్ డెవలప్‌మెంట్ ఇన్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టూట్యూషన్ ఇన్ ఈస్ట్ గోదావరి డిస్ట్రిక్ట్ డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీని విశాఖ ఆంధ్రా యూనివర్సిటీ ప్రదానం చేసినట్టు పేర్కొన్నారు. స్కూల్ ఆఫ్ బిజినెస్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న మేనేజ్‌మెంట్ అధ్యాపకురాలు నిషా కుమారి గీతంకు డాక్టరేట్ లభించిందన్నారు.

ప్లీజ్..రోడ్లెయ్యండి

- కొలిక్కిరాని పుంత రోడ్ల నిర్మాణం
- అభివృద్ధికి నోచుకోని గ్రామాలు
- నిధులు అందక ఆటంకం



నెల్లిపూడిలో రాళ్లు లేచిన రోడ్డు



శంఖవరంలో పిచ్చి మొక్కలతో అధ్వానంగా పుంత రోడ్డు

శంఖవరం: రైతులు, పశువులు పొలాలకు వెళ్లేందుకు ఉన్న పుంత రోడ్లు అభివృద్ధికి ఆమడ దూరంలో నిలుస్తున్నాయి. అధికారంలోకి వస్తే రోడ్డులు వేస్తామని గొప్పలు చెప్పిన కూటమి నేతలు నోరు మెదపడంలేదు. ప్రజా ప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఏ పుంత రోడ్డు చూసిన రాళ్లు లేచి పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్నాయి. కనీసం నడవడానికి వీలు లేకుండా ఉండడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలోని 14 పంచాయతీలకు సంబంధించిన చిరు గ్రామాల్లో పొలాలకు అనుసంధానంగా ఉండే పుంత రోడ్లు అస్తవ్యస్తంగా అడుగడుగున దర్శనమిస్తున్నాయి. కత్తిపూడి నుంచి పాత కొత్తూరు, పాత వజ్రకూటం గ్రామాలకు వెళ్లే పుంత రోడ్డు పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. వీటితో పాటు నెల్లిపూడి, కొంతంగి, జి.కొత్తపల్లి, మండపం, గౌరంపేట, పి.మల్లాపురం, వేళంగి గ్రామాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది.

పొలాలకు సంబంధించి ఏ పని చేసుకోవాలన్న ఈ పుంత రోడ్లు సక్రమంగా ఉండాలని రైతులు అంటున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని బురదమయంగా మారడంతో సమస్య మరింత జటిలమవుతుందని వాపోతున్నారు. గతంలో పంచాయతీ, ఉపాధిహామీ పథకం ద్వారా ఈ పుంత రోడ్లు అభివృద్ధి చేసేవారు. అయితే ప్రస్తుతం ఈ పుంత రోడ్లను అధికారులు నిర్లక్ష్యం చేయడంతో మరుగున పడ్డాయి. పండిన పంటను పొలం నుంచి తీసుకురావాలంటే ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం చెరువులు, కాలువలను మాత్రమే పంచాయతీ, ఉపాధి సిబ్బంది అభివృద్ధి చేస్తున్నారే తప్ప పిచ్చిమొక్కలు, రాళ్లు లేచి ఉన్న పుంత రోడ్లను అభివృద్ధి చేయడం లేదని ఆయా గ్రామాల రైతులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

పొలాల్లోకి వెళ్లాలంటే కష్టంగా ఉంది..



వ్యవసాయం సాగుచేసుకోవడానికి ఈ పుంత రోడ్ల నుంచే వెళ్లాల్సివస్తుంది. పొలంలోకి వెళ్లడానికి వేరే మార్గం లేదు. పొలాల్లో పండిన ఉత్పత్తులను ఈ రహదారి మీదుగా మార్కెట్‌లకు తరలించాలి. పుంత రోడ్లు అభివృద్ధికి నోచుకోకపోవడం వలన ఇబ్బందులకు గురవుతున్నాం. సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరిస్తారని ఆశిస్తున్నాం.

మేకల సత్యనారాయణ,
రైతు, వేళంగి, శంఖవరం మండలం

రోడ్లను అభివృద్ధి చేయండి



పుంత రోడ్లు రాళ్ల లేచి, పిచ్చి మెక్కలతో ఉండడం వలన పంట పోలాలకు వెళ్లడానికి ఇబ్బందిగా ఉంది. మా గ్రామంలో పశుసంపద ఎక్కువగా ఉండడం వలన ఈ పుంత దారుల నుంచే పశువులను మేతకు తీసుకువెళ్తారు. రైతులు, పశుకాపరులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు పుంత రోడ్లను అభివృద్ధి చేస్తారని కోరుతున్నాం.

మామిడి సత్యనారాయణ,
రైతు, జి.కొత్తపల్లి, శంఖవరం

మొరాయించిన సర్వర్



ప్రత్తిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద కక్షిదారుల నిరీక్షణ

ప్రత్తిపాడు: సర్వర్ మొరాయించడంతో మండలంలో భూ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మందగించింది. ప్రత్తిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాయలంలో శుక్రవారం ఈ సమస్య తలెత్తింది. భూ క్రయవిక్రయాలలో రిజిస్ట్రేషన్లు చేపట్టేందుకు సర్వర్ మందగించడంతో ఈ సైన్ రిజిస్ట్రేషన్లు పని జటిలమయ్యింది. భూ తదితర రిజిస్ట్రేషన్ల కోసం కక్షిదారులు నిరీక్షించి అసహనం వ్యక్తం చేశారు. ఉదయం నుంచీ ఇదే తంతు కొనసాగింది. మధ్యలో మధ్యాహ్నం 12.30, తిరిగి 2.30 నుంచి 3.30 వరకు సర్వర్ పనిచేసింది. రోజంతా ఇదే సతాయింపు. అతి కష్టం మీద శుక్రవారం సుమారు 25 వరకు రిజిస్ట్రేషన్లను పూర్తిచేయగలిగామని సబ్ రిజిస్ట్రార్ వి.విక్టర్ డానియేల్ వెల్లడించారు.

గంజాయి తరలిస్తున్న యువకుల అరెస్టు



పట్టుబడ్డ యువకులతో సీఐ సత్యకిశోర్, ఎస్సై పవన్‌కుమార్, సిబ్బంది

గోకవరం: మండల కేంద్రం గోకవరంలో స్కూటీపై గంజాయి తరలిస్తున్న ముగ్గురు యువకులను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను కోరుకొండ సీఐ సత్యకిశోర్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వివరించారు. స్థానిక ఠాణాసెంటర్ వద్ద శుక్రవారం ఉదయం ఎస్సై పవన్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తుండగా రాజమహేంద్రవరంకు చెందిన చింతల మురారి, సూరి హేమంత్, దూలపల్లి నాని ప్రయాణిస్తున్న స్కూటీని ఆపి తనిఖీ చేయగా 11 కేజీల గంజాయి లభించింది. దీంతో వారిని వెంటనే అదుపులోకి తీసుకుని స్కూటీ, రెండు సెల్‌ఫోన్‌లు, గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం రాజమహేంద్రవరం తరలించామన్నారు.

శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పర్యటన

ప్రత్తిపాడు రూరల్: ఏపీ కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్ కాకినాడ జిల్లాలో ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు పర్యటిస్తారని కుమ్మరి శాలివాన సంఘం జిల్లా అధ్యక్షుడు పసలపూడి ప్రసాదరావు ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ నియోజకవర్గల్లోని ఆయన పర్యటించి కుమ్మరి వృత్తిదారుల సమస్యలను అడిగి తెలుసుకుంటారన్నారు. కార్పొరేషన్ చైర్మన్ హోదాలో తొలిసారిగా పర్యటిస్తున్న నేపథ్యంలో కుమ్మరి శాలివాహన సంఘ సభ్యులు భారీ ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రసాదరావు కోరారు.

రూ.30 వేల ఫిక్స్‌డ్ డిపాజిట్

గోకవరం: మండలంలోని రంపయర్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సీతానగరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చిక్కం దొరబాబు రూ.30,116 ఫిక్సడ్ డిపాజిట్ అందజేశారు. ఈ మొత్తాన్ని శుక్రవారం పాఠశాల స్టాఫ్ సెక్రటరీ పెదిరెడ్ల రాజుకు ఆయన అందించారు. ఈ డిపాజిట్‌పై వచ్చే వడ్డీని యేటా పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు కానుకగా ఇవ్వాలని ఆయన సూచించారు.

టిప్పర్, కారు ఢీ

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి టిప్పరు, కారు ఢీకొన్న ఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు రాజమహేంద్రవరంలోని నగల దుకాణంలో పనిచేస్తున్న సుబ్బారావు, బాలాజీ, నాగరాజు, ఈశ్వరరావులు కారులో తుని నుంచి రాజమహేంద్రవరం వెళ్తున్నారు. హైవే నుంచి లంపకలోవ వైపు వెళ్తున్న టిప్పర్, కారు స్థానిక నరేంద్రగిరి జంక్షన్‌లో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సుబ్బారావు, బాలాజీలకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని హైవే మెయింన్‌టినెన్స్ యార్డు అంబులెన్సులో స్థానిక కమ్యూనిటి హెల్త్ సెంటర్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

తుని రూరల్: ఎస్.అన్నవరంలో వీరాంజనేయ పాత సంచుల రిపేర్ వర్కర్స్ యూనియన్ భవన నిర్మాణానికి రాజ్యసభ సభ్యుడు సానా సతీష్, ఎమ్మెల్యే యనమల దివ్య శుక్రవారం శంకుస్థాపన చేశారు. నాయకులు మాట్లాడుతూ ఎంపీ గ్రాంట్స్ నుంచి రూ.25 లక్షలు మంజూరు చేస్తున్నట్టు పేర్కొన్నారు. మరో రూ.25 లక్షలతో నిర్మించిన పలు సీసీ రోడ్లను ప్రారంభించారు. గ్రామంలో కొలువైఉన్న శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామిని దర్శించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం తేటగుంట క్యాంపు కార్యాలయంలో 22 మందికి రూ.15.22 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు పత్రాలు, చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే దివ్య పంపిణీ చేశారు.

పేదలకు బియ్యం పంపిణీ

జగ్గంపేట: మండల కేంద్రం జగ్గంపేట శివారు రంగవల్లి నగర్‌లో నివసిస్తున్న ఎస్టీ కుటుంబాలకు ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం శుక్రవారం బియ్యం పంపిణీ చేపట్టింది. రంగవల్లి నగర్‌లో 300 ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన నిరుపేద కుటుంబాలకు మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం చేస్తున్నారని రైతు కూలిసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజినేయులు మండిపడ్డారు. ఇప్పటికైనా పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.